శరణం నీ దివ్య చరణం

సంకట హరణా! వేంకటరమణా!
నీ కృపా కటాక్ష వీక్షణములతోనే ప్రముఖాంధ్ర 23వ సంవత్సరంలోకి ప్రవేశించింది!

మూల విరాట్ స్వరూప చిత్రం



వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన
వేంకటేశ సమోదేవ నభూతో న భవిష్యతి

వేంకటాద్రితో సమానమైన ప్రదేశం ఈ బ్రహ్మాండంలో మరొకటి లేనే లేదు.
వేంకటేశునితో సమానమైన దేవుడు గతంలో లేడు భవిష్యత్తులో ఉండబోడు.



దివ్య జీవితాన్ని కోరాలిగానీ, దీర్ఘ జీవితాన్ని కోరరాదు!

సత్యసాయి ఉవాచ

నేనెపుడు దివ్య జీవితాన్ని గడపాలనే తలిచాను. దీర్ఘ జీవితం కోసం తపన పడలేదు

అనుక్షణమూ ఏలిక ఏడుకొండుల వేంకటేశ్వరుని పాదాలకే ప్రణమిల్లుతుంటాను. సత్యసాయీశుని సద్బోధల సారాన్నే వ్రాస్తూంటాను. ధర్మోరక్షతి రక్షతి- అనే విశ్వాసాన్ని శ్వాస ఉన్నంతవరకూ పాటించమని నా తల్లిదండ్రులు పిన్నతనంలోనే బోధించారు. ఆస్తుల్ను విశ్వసించవద్దనీ, అనువంశికంగా వస్తున్న మంచితనాన్ని మరువవొద్దనీ నా తల్లిదండ్రులు బోధించారు. 200 ఎకరాల ఏకచ్ఛత్రాధిపత్యం పోయినా వారు కృంగిపోలేదు. గాంధీగారు పాలకొల్లు వచ్చినప్పుడు మా అమ్మ వొంటిమీద ఉన్న నగలన్నీ ఒలిచి యిచ్చింది. మా నాన్నగారు బంగారం లాంటి సర్కారు ఉద్యోగాన్ని విడిచి పెట్టారు.

వరిధనంలో పుట్టిన మాకు వరీ, ధనం లేకుండా పోయింది. ఉన్న బృహత్మందువా భవనమూ పోయింది. తాతగారు కట్టించిన శివాలయం, అర్చకులకూ కట్టించిన ఇళ్లు మాత్రమే ఉన్నాయ్. శివాలయానికి వ్రాసియిచ్చిన భూములు, పంటపై చిల్లుగవ్వ కూడా తీసుకోరాదు. అనెడి జీవిత విధానాన్ని అనుసరించాను.

కలియుగ దైవం తిరుమల వేంకటేశ్వరుణ్ణి ఆరాధించినట్లే కలియుగ అవతారమూర్తి సత్యసాయీశుని బోధనా బాటను దివ్యజీవన బాటగా అనుసరిస్తున్నాను. కష్టార్జితాన్నే అనుభవిస్తూ అందులో కల సుఖాన్ని గ్రోలుతున్నాను.

చివరి శ్వాస వరకూ ప్రముఖాంధ్ర నన్ను వీడేటట్లు చేయకు సాయీ!

- గోటేటి శ్రీరామారావు

ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

జనవరి 2017

సంపుటి : 23 **264** సంచిక : 1

2017 సంవత్సరమా! నీకు సుస్వాగతం!

-దుర్ముఖి నీలచ్ఛాయలు నీ రాకపై ఉన్నా, భారతదేశంలోని దుర్ముఖత్వాన్ని నీవే పారద్రోలాలి!

-హేవిళంబి నామసంవత్సరం సుఖైశ్వరాలతో విలసిల్లడానికి నీవే ప్రారంభకర్తృత్వం వహించాలి!!

ఆంగ్లవత్సర ప్రారంభమైనా, ఆంధ్రవత్సరప్రారంభమైనా ఆయురారోగ్య ఐశ్వర్యాలను ప్రసాదించాలని ప్రార్థిస్తాం... తీపి, చేదు, పదార్థాలను సేవిస్తాం- అంటే కష్టసుఖాలను అనుభవించే శక్తిసామర్థ్యాలను చేకూర్చాలన్నదే ఆ ప్రార్థన అంతరార్థం.

దుర్ముఖిలో దేశమెన్నో ఈతిబాధలకు గురైయింది. జల కల్లోలాన్ని కలిగించింది. సాగర జలం తీరంమ్మీదకు చరచరా చొచ్చుకుని వచ్చింది. సముద్రజీవులు జీవశ్చవాలై భువిపై స్వైరవిహారం చేసాయ్.

ఇరుగు పొరుగు దేశాల్నుంచీ ఏ ప్రమాదం వస్తుందనే భీకర పరిస్థితి ఏర్పడింది

హిమాలయాల్లోని హిమవత్పాతమంతా భువిని ముంచి వేస్తుందాననే సంఘటనలు జరిగాయ్. పాకిస్తాన్ వంటి దేశాల చొరబాటులు జరిగాయ్.

అరకొరా ఆయుధాలతో, దారిలేని పర్వత మార్గాల్లో దేశభక్తిగల సైనికులు చొరబాటులను అడ్డగించారు. ఇరుగుపొరుగు దేశాల మధ్య ద్వేషాగ్ని పెరగకుండా భారతప్రభుత్వం చాకచక్యంతో వ్యవహరించింది. అవసరమైతే ఎదుర్కోమని సరిహద్దు సైనిక దళాలకు ఆదేశమిచ్చింది. స్థైర్యం కలుగచేస్తూ ప్రధాన మంత్రి నరేంద్రమోడి సైనిక దళాలకు ఉత్సాహం కలిగించడంతోపాటు -పాకిస్థాన్ తీవ్రవాదు లున్న ప్రాంతంలోకి చొరబడి ఎదుర్కోవడంతో కిరాయి తీవ్రవాదుల మదమణిచారు. ఏ ప్రధానీ ఇంతవరకూ సాహసించని ఎదుర్పాటు నిర్ణయాన్ని ప్రధాని మోడీ నిర్దేశించడంతో ప్రతిపక్షాలు సహితము ప్రశంసించాయి.

దుర్ముఖి వెడుతూ వెడుతూ కల్గించిన దుర్ముఖ తీవ్రత దేశ సార్వభౌమత్వాన్ని, ధీరత్వాన్ని చాటింది. 2017 సంవత్సర ప్రారంభానికీ యిది శుభసంకేతం. హేవిలంబి నామ సంవత్సర శుభారంభానికిది నాంది.

ఇల్లు అలికిన పండుగవచ్చినట్లు, ప్రజలూ, ప్రభుత్వమూ అంతర్మదనంగా ఉన్న ద్వేష దోషభావాలను విడనాడాలి, ఐక్యతాభావంతో దేశాభివృద్ధి దోహదకారులు కావాలి. అనేకత్వంలోనే ఏకత్వం ఉందని చాటిచెప్పాలి.

సర్వేజనా స్సుఖినోభవన్తు సమస్త సన్మంగళాని భవన్తు.

సకలైశ్వర శుభమస్తు!

శాన్తిరస్తు!

బుధజన విధేయుడు

- గోటేటి శ్రీరామారావు

Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com
YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-

సూర్యసదనం - యోగివర్యుడు శ్రీకృష్ణయాజీ అవిరళ కృషి

శ్రీకాకుళం జిల్లాలోని అరసవల్లిలో సుఖసంతోషాలనిచ్చే సూర్యభగవాన్ ఆలయం సూర్యోపాసన చేసే సూర్యోపాసకుల కారణంగానే బాధలనుపశమించుకోగల్గుతుంది.

అరసవల్లి సూర్య ఆలయానికి అనతి దూరంలో గరివిడి గ్రామంలో సూర్యసదనం ఉంది. అనునిత్యమూ సూర్యోపాసనచేసే కర్మయోగి కృష్ణయాజీ అక్కడే ఉన్నారు.

మానవుల జీవితంలో సంతోషాలు దుఃఖాలు, మనలో శారీరకంగాను, మానసికంగాను జరిగే మార్పులకు ముఖ్యకారణం సూర్యదేవుడే!

తమిళనాడులోని తంజావూరు జిల్లాలో నవగ్రహాలలో గ్రహాలకు ప్రత్యేకమైన ఆలయాలున్నాయి. సూర్యుడి కిరణాల నుండి వెలువడే కిరణాల ప్రభావం గురువు, శని, శుక్రుడు, బుధుడు, కుజుడు, మరియు చంద్రుడు మొదలైన ఆరుగ్రహాలపై అతివేగంగా తాకి ఆ తర్వాత భూమిని తాకుతాయి. కిరణాలు మానవుల శరీరంపై, హృదయంపై మెదడులోని నరాలపై ప్రభావం చూపడం వల్ల ఎన్నో మార్పులు కలుగుతాయ్.

కాశ్యప మహర్షికి మరియు ఆయన సతీమణి అదితికి విశ్వవానుడు మొదలైన పన్నెండు మంది పుత్రులు జన్మించారు. అదితి యొక్క పుత్రులైనందువల్ల వారిని ఆదిత్యులు అనేవారు.

శారీరకంగా జరిగే మార్పులు సూర్యుడు, శుక్రుడు, కుజుడు, రాహువు మొదలైన గ్రహాలు నిర్ణయిస్తాయి. మానసికంగా బాధించే కష్టాలు చంద్రుడు, బుధుడు, కేతువు మొదలైన గ్రహాల వల్ల ఏర్పడతాయి. గురువు శని మొదలైన గ్రహాలు శారీరకంగాను మానసికంగానూ మహత్తరమైన ప్రభావాన్ని చూపగలుగుతాయ్. గ్రహదోషమున్న వారు పరిహారం చేస్తే దుష్పరిణామాలు కొంతవరకు తగ్గుతాయి.

మొదటి పుత్రుడు విశ్వవానుడు సూర్యుడని చెబుతారు.

పూర్వం చీకటిమయంగా ఉన్న భూమిని బ్రహ్మదేవుడు విభజించాడు. ఆ సమయంలో ఓం అనే ప్రణవనాదం సర్వదిక్కుల్లో ప్రతిధ్వనించింది. ఆ స్వరం నుంచి సూర్యుడు అవతరించాడు. అని సూర్యుడి జన్మరహస్యం గురించి మార్కండేయ పురాణం తెలుపుతుంది.

సూర్యుడు ద్వష్టయొక్క కుమార్తె ఉషను వివాహం చేసుకున్నాడు. వారికి వైత్సుతమను, యముడు, అశ్విని దేవతలు జన్మించారు.

సూర్యుడి నుండి వెలువడే కిరణాల ఉష్ణాన్ని సహించలేకపోయింది ఉష. సుకోమలమైన ఉష ఆమె నీడనే ఒక స్త్రీలా సృష్టించింది. సూర్యుడికీ విషయం తెలియనివ్వక ఆమెను సూర్యుడి వద్దకు పంపి ఉష పుట్టింటికి వెళ్లిపోయింది.

ఉషకు ప్రతిరూపంగా ఉన్న ఆ స్త్రీ పేరు ప్రత్యుష అనబడే ఛాయాదేవి. ఆమె తన గురించి సూర్యుడికి రహస్యంగా ఉంచి ఆదిత్యుడితో సకలభోగాలతో జీవించసాగింది. వారికి సావర్ణిమను, శని అనే కుమారులు, భద్ర అనే కుమార్తె జన్మించారు.

ఉషాదేవి కుడిచేత నీలోత్పల అనే పుష్పము, ప్రత్యుషాదేవి ఎడమచేత తామరపువ్వుతో చిరునవ్వుతో దర్శనమిస్తారు.

తమిళనాడులో సూర్యుడికి ప్రత్యేకమైన ఆలయమున్న పుణ్యక్షేత్రం సూర్యనారాయణ కోవెల. ఆంధ్రదేశంలోని అరసవల్లిలో సూర్యదేవుని ఆలయం ఉన్నది. సూర్యదేవుని ఆరాధనం చేసే సూర్యసదనం గరివిడిలో ఉన్నది.

సూర్య భగవాన్ నవగ్రహాలకు అధిపతి. సాత్విక గుణం ఉన్నవాడు. క్షత్రియ కులానికి చెందినవాడు. శివుడి మూడు కళ్ళల్లో కుడి కన్నుగా ఉన్నవాడు. ఆరోగ్యం, శుభం, మంచిపేరు మొదలైనవాటిని ప్రసాదించేవాడు.

సూర్య భగవాన్‌కు ఆదివారం అభిషేకం చేయడం, వ్రతమాచరించడం, సూర్య నమస్కారం చేసి, ఎర్రటి వస్త్రం, ఎర్రటి మణి లేదా తామరపువ్వుతో అలంకారం చేయడం, గోధుములను దానం చేయడం, సూర్యమంత్రాలను ఉచ్చరించడం, యాగం చేయడం, అర్చన మరియు దీపధూపాలను చూపి దీపారాధన చేయడం, మొదలైనవి చేయడం వల్ల గృహదోషం పరిహారమైపోతుంది. ఆ పరిహారాన్ని ఉచితంగా చేస్తూ ఉపసంహరింపచేస్తున్నవారు సూర్యసదనం అధినేత, సూర్యోపాసకుడు శ్రీకృష్ణయాజీగారు. ●

32 యుగాలలో సామాన్యులు చేయని వేదనిధిని ఆదిశంకర భగవత్పాదులు 32 సంవత్సరాలలోనే అందించారు

32 యుగాలలో సామాన్యులు చేయలేని పనిని శ్రీ ఆదిశంకరాచార్యులు 32 సంవత్సరాలలో సాధించారు. అంతటి మహత్తర సేవను చేసినా ఆయన తానేమీ కోరలేదు. ఆయన విజయాలను వివరించే శ్లోకం.

అష్టవర్షే చతుర్వేదీ ద్వాదశే సర్వశాస్త్రవిత్
షోడశే కృతవాన్ భాష్యం ద్వాత్రింశే మునిరభ్యగాత్॥

ఎనిమిది సంవత్సరాల వయస్సులో నాలుగు వేదాల అధ్యయనం పూర్తి చేశారు. పన్నెండు సంవత్సరాల వయస్సు వచ్చేనాటికి అన్నిశాస్త్రాలలో పాండిత్యాన్ని సాధించారు. పదహారు సంవత్సరాలకు అన్ని భాష్యాలను పూర్తి చేశారు. ముప్పది రెండు సంవత్సరాలకు తన అవతార లక్ష్యాన్ని నెరవేర్చారు. కైలాసానికి తిరిగి చేరుకున్నారు. పరమేశ్వరుడు తన ఆదిశంకరాచార్య అవతారంలో తన అవతార లక్ష్యసాధనకు అవసరమైన సమయాన్ని భూమి మీద గడిపి తిరిగి కైలాసానికి చేరుకున్నారు. అవసరమైన దానికంటే క్షణం ఎక్కువగాని, తక్కువగాని గడపలేదు అన్నారు శృంగేరి శ్రీసన్నిధానంవారు శ్రీశ్రీ విదుశేఖర భారతీ స్వామి వారు. శ్రీఆదిశంకరాచార్య ధర్మాన్ని రక్షించారు. నాలుగు మఠాలను ఏర్పరచి, ఆ మఠాలలో తన నలుగురు శిష్యులను పీఠాధి పతులుగా నియమించారు ధర్మరక్షణ, బాధ్యతలను అప్పగించారు. ఆ నాలుగు పీఠాలలో దక్షిణామ్నాయ శ్రీశారదాపీఠం, శృంగేరి, శ్రీఆది శంకరాచార్యుల కాలం నుండి నేటి వరకూ సంప్రదాయాన్ని పూర్వమువలెనే పాటిస్తూ వస్తున్నది.

శృంగేరీ శారదాపీఠం గురుపరంపరలో మహాత్ములందరూ, శ్రీ ఆదిశంకరాచార్యులవలె ధర్మాన్ని రక్షించినవారు. శ్రీశారదాపీఠ 32వ పీఠాధిపతులు జగద్గురు శ్రీవృద్ధ నరసింహ భారతీ మహాస్వాములవారు ధర్మరక్షణలో చాలా కష్టపడ్డారు. ఆయన సన్యాస దీక్షను స్వీకరించిన అయిదు రోజులకే ఆయన గురువు విదేహముక్తిని పొందారు. ఎన్నో కష్టాలు ఎదురైనా శ్రీవృద్ధ నరసింహ భారతీ మహాస్వామివారు ధర్మరక్షణలో స్థిరంగా నిలబడ్డారు. ఆయన శిష్యులు జగద్గురు శ్రీసచ్చిదానంద శివాభినవ నరసింహ భారతీ మహాస్వాములవారు ధర్మరక్షణకై విశేషంగా కృషి చేశారు. తమ శిష్యులైన జగద్గురు శ్రీచంద్రశేఖర భారతీ మహాస్వాములవారు ధర్మాన్ని ఆచరించారు. రక్షించారు. శిష్యులకు ధర్మాన్ని బోధించారు. తత్ఫలితంగా అనేకమంది శిష్యులు ధర్మమార్గంలోనే ప్రవర్తించారు. 'జీవన్ముక్తులు' అనే ఒక్కపదం చాలు అటువంటి మహాత్ములు వర్ణించటానికి. ఆ మహాత్ములను దర్శించటానికి కూడా పుణ్యం చేసికొని ఉండాలి. అట్టి మహాత్ములు అలంకరించినది ఈ దక్షిణామ్నాయ శ్రీశారదాపీఠం. జగద్గురు శ్రీచంద్రశేఖర భారతి మహాస్వాములవారి శిష్యులు జగద్గురు శ్రీఅభినవ విద్యాతీర్థ మహాస్వామివారు. ఆయన దేశమంతటా పలు మార్లు పర్యటించి ప్రజలలో ధార్మిక చైతన్యాన్ని జాగృతం చేశారు. తమ గురువుగారు, జగద్గురు శ్రీమదభినవ విద్యాతీర్థ మహాస్వాములవారి శిష్యులు అయిన జగద్గురు శ్రీభారతీతీర్థ మహా స్వాములవారు శ్రీఆదిశంకరాచార్యులు తద నంతర గురుపరంపర చూపిన మార్గాన్నే అనుసరిస్తున్నారు అని చెప్తూ తాము వారి శిష్యులు కావటం తమ అదృష్టమని అందు వలన తమకు ధన్యాత్మ భావన కలుగుతోందని శ్రీసన్నిధానంవారు అన్నారు.

శ్రీశ్రీశ్రీ విదుశేఖర భారతీస్వామివారు

తమ వర్ధంతినాడు బహు ప్రాంతాల నుండి వచ్చిన శిష్యులను చూసి తమకు సంతోషంగా ఉన్నదనీ శ్రీశారదాపీఠానికి చెందిన గురుపరంపర యున్నట్లే శిష్యపరంపర ఉన్నదనీ, తమ గురువుగారి పట్ల, తమపట్ల కూడా భక్తి ప్రపత్తులను ప్రదర్శిస్తున్న శిష్యపరంపరను చూసి తమకానందదాయకంగా ఉన్నదన్నారు శ్రీసన్నిధానం. ఈ సంప్రదాయాన్ని కొనసాగించాలని చెప్తూ జగద్గురు శ్రీవిధుశేఖర భారతి స్వామివారు శిష్యులకు ఆశీస్సులనందజేశారు.

(శ్రీశంకరకృపకు కృతజ్ఞతలు)

ఆంధ్ర విద్యార్థుల అపూర్వ సాహసం!
కిలీ మంజారోపై ఎగిరిన తెలుగు పతాకం!!
పర్వతాన్ని అధిరోహించిన తెలుగు విద్యార్థులు

ఆఫ్రికా దేశం టాంజానియాలోని కిలిమంజారో పర్వత శిఖరంపై తెలుగు కీర్తి రెపరెపలాడింది. తెలంగాణా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని 14 మంది విద్యార్థులు బృందమై క్లిష్టమైన ఈ పర్వతాన్ని అధిరోహించింది. స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించు కుని 20 అడుగుల జాతీయ జెండాను పర్వతంపై ఎగురవేసారని మెదక్ జిల్లా కలెక్టర్ రొనాల్డ్ రోస్ చెప్పారు. దీంతో పాటు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటం, పూర్ణపై నిర్మించిన చిత్రం పోస్టర్‌ను అక్కడ విడుదల చేశారు. వీరిలో కొల్చారం కేజీబీవీకి చెందిన గమని నర్సమ్మ (12) పిన్నవయస్కురాలు. ఈ ఫీట్‌తో కిలిమంజారో ఎక్కిన అతి చిన్న వయస్కుల బృందంగా ప్రపంచ రికార్డు సృష్టించింది. పిన్న వయసులోనే ఎవరెస్టు ఎక్కి రికార్డు నెలకొల్పిన స్వేరోస్ విద్యార్థిని మలావత్ పూర్ణ, పర్వతారోహకురాలు రాజి తమ్మినేని, ట్రాన్సెండ్ అడ్వంచెర్స్ సంస్థ నిర్వాహకుడు బూచినపల్లి శేఖర్‌బాబు నేతృత్వంలో ఈ నవంబర్ 8న హైదరాబాద్ నుంచి 18మంది విద్యార్థుల బృందం బయలుదేరింది. దాదాపు రూ. 60 లక్షల ఖర్చుతో చేపట్టిన అత్యంత కఠినమైన కిలిమంజారో అధిరోహణలో బృందంలోని 14మంది విజయవంతమయ్యారు. వీరంతా రాష్ట్రంలోని కస్తూర్బా గాంధీ, గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యార్థులు. సముద్రమట్టానికి 19,340 అడుగుల ఎత్తులో, అత్యంత ప్రమాదకరమైన ప్రతికూల వాతావరణ పరిస్థితులతో ఉండే ఈ పర్వతా రోహణను నవంబర్ నెల 10న ప్రారంభించిన విద్యార్థులు ఆదివారం పూర్తి చేశారు. సోమవారం సాయంత్రం కిందికి దిగుతామని ప్రకటించి దిగారు.

ప్రేమ స్వరూపుడు పుడమిపై పుట్టిన వేళ...

*రత్నాకరం సత్యనారాయణ రాజు... ఈ పేరు చెబితే చాలామందికి తెలియకపోవచ్చు. భగవాన్ సత్యసాయి బాబా అని చెబితే మాత్రం ప్రతి ఒక్కరికీ తెలుసు. **1923** నవంబర్ **23**న అనంతపురం జిల్లా గొల్లపల్లి గ్రామంలో (నేటి పుట్టపర్తి) ఈశ్వరాంబ, పెదవెంకమరాజు దంపతులకు జన్మించిన సత్యనారాయణ రాజు. భగవాన్ సత్యసాయిబాబా మానవతా విలువలతో కూడిన విద్యనందించిన విద్యాదాత. ప్రేమ, కరుణ, దయ, మానవత్వంగల ఆరోగ్య ప్రదాత. సర్వ మానవాళికి ఆధ్యాత్మ విద్యను బోధించిన జ్ఞానదాత. సాయిభగవానుడిగా, విశ్వవ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల హృదయాలలో స్థిరనివాసం ఏర్పరచుకున్నారు.*

సత్యసాయి బాబా కీర్తి ప్రతిష్ఠలు ఖండాంతరాలు దాటి, విశ్వవ్యాప్తమయ్యాయి. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసలనే సనాతన ధర్మాలను బోధిస్తూ, ఆచరిస్తూ పుట్టపర్తిని గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దారు. తోటివారికి సాయపడటంలోనే భగవంతుడున్నాడని బోధించిన సాయి. తాను అక్షరాలా ఆచరించి, అతి సామాన్యుని నుంచి అసమాన్యుడి దాకా, ప్రధానమంత్రి వరకూ, దరిద్రనారాయణుని నుంచి దేశాధ్యక్షుని వరకు, కార్మికుని నుంచి క్రీడాకారుల వరకు ఏన్నో కోట్ల గుండెల్లో కొలువుదీరారు.

కులం, మతం, జాతి, ప్రదేశం, దేశం... ఇవన్నీ మనం గీసుకున్న పరిధులే. వీటన్నింటి మధ్య సమన్వయం ప్రధానం, సంఘర్షణకు తావులేని రీతిలో మన ఆలోచనలు ఉండాలి.

నేను ఆత్మనని తెలుసుకోవటమే సత్యం. పవిత్ర జీవనమే శివం. ఆదర్శ జీవితమే సుందరం అని బోధించారు.

ఆత్మనిగ్రహం అన్నింటికన్నా ముఖ్యం: రాముడు 34 విద్యలలో ఆరితేరితే, రావణుడు 64 విద్యలు అభ్యసించాడు. రామునికంటే అధికంగా చదువుకున్నప్పటికీ ఇంద్రియ నిగ్రహం లేక పోవడం మూలంగా రావణుడు రాక్షసుడయ్యాడు. ఆత్మనిగ్రహాన్ని కలిగిన రాముడు దేవుడయ్యాడు.

నమ్మిన దైవం యెడల దృఢవిశ్వాసం, ధృఢమైన బలం కలిగి ఉండాలి. నిర్మలత్వం ఇందుకు తోడుగా ఉండాలి.

ఆధ్మాత్మికతనే అంటిపెట్టుకోవాలి: ఎట్టి పరిస్థితులలోనూ నిన్ను వదలనిది, నీ దగ్గరనుంచి కదలనిది, నిన్ను అన్ని విధాల సన్మార్గంలో పెట్టేది ఆధ్యాత్మిక ధనమొకటే.

దైవం కోసం పరితపించాలి: లౌకిక విషయాలను కాకుండా దైవాన్ని మాత్రమే కోరుకున్నప్పుడు విజయం వరిస్తుంది.

సేవార్తుడు

తాగేందుకు గుక్కెడు నీరు లేక దప్పికతో అల్లాడుతున్న అనంతపురం జిల్లా వాసుల దాహార్తిని తీర్చేందుకు కొన్ని వందల కోట్ల రూపాయలు వ్యయం చేసి **1700** గ్రామాలకు తాగునీరందించిన జీవన ప్రదాత, అపరభగీరథుడు సత్యసాయి. ఈ వితరణను తన జిల్లాకే పరిమితం కాకుండా కరీంనగర్, మహబూబ్‌నగర్, మెదక్, ఉభయగోదావరి జిల్లాల ప్రజలకు, చెన్నయ్ నగరవాసులకు సత్యసాయి నీటి పథకం ద్వారా దాహం తీర్చిన సేవార్తుడు. ఈ ప్రేమ స్వరూపుని సందర్శించటానికి **180** దేశాల నుంచి భక్తులు పుట్టపర్తికి వచ్చేవారు. సాయి కుల్వంత్‌హాలులో ఎత్తైన ఆసనంపై నుంచి తనను సందర్శించటానికి వచ్చిన వేలాది భక్తులకు ఆశీస్సులందించిన సత్యసాయి నేడు మనమధ్య లేరు. అయితేనేం ఆయన మహాసమాధే అనంతమైన ఓదార్పుగా..కొండంత అండగా నిలుస్తోంది.



మాలిన్యాన్ని వదలించుకోవాలి: తుప్పుపట్టిన ఇనుమును అయస్కాంతం ఆకర్షించనట్లే మనసులో మాలిన్యం ఉన్న వానికి భగవంతునికిపై ఆసక్తి ఉండదు.

మంచిని మాత్రమే వెదకాలి: ఇతరుల తప్పులను వెదకడం గొప్పకాదు. వారిలోని మంచిని గుర్తించి, ప్రేమించాలి.

సమర్థించుకోవడం కాదు... సమర్ధతను పెంచుకోవాలి. మనలో దోషముంచుకుని, దానిని కప్పిపుచ్చుకునేందుకు దారులు వెదకటం తప్పు, సమర్ధతను పెంచుకోవాలి.

ఆయన బోధనల ప్రకారం ఆకలిగొన్న వారికి అన్నం పెట్టడం, ఆపదలో ఉన్నవారికి ఆసరా ఇవ్వటం, కష్టాల్లో ఉన్నవారి కన్నీళ్ళు తుడవటం, సేవచేసేందుకు మార్గాన్ని వెతుక్కుని, సేవతోనే జీవితాన్ని లీనం చేయడమే భక్తులు ఆయనకు సమర్పించే దివ్య కానుక. ●

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
"అజంతా"
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని - చెన్నై
044 25204046, 26171341

భారతదేశపు అద్భుతమైన ప్రజాస్వామ్య వారసత్వం ప్రపంచ దేశాలను ప్రభావితం చేసింది!

భారత జాతీయతనూ, భారతదేశపు ప్రజాసౌమ్యత్వాన్ని ప్రతిబింపచేసిన ప్రధాని మోడీ.

స్వేచ్ఛాయుత భారతావని- వలసపాలన సంకెళ్లు తెంచుకొని **15** ఆగస్టు **1947**న స్వాతంత్ర్యం సాధించి **70**వ సంవత్సరం దాటింది.

మన స్వాతంత్ర్యానికి వాస్తవరూపం కల్పించిన ఎంతోమంది అమర వీరుల త్యాగంతో ఏర్పడిన అపార వారసత్వాన్ని అందుకుందాం.

రండి, మనం మాతృదేశాభిమానం పట్ల ఉత్సాహాన్ని చూపుతూ దేశ వ్యాప్తంగా స్వాతంత్ర్య వేడుకలలో పాలుపంచుకుందాం. పటిష్టమైన, యువ భారతావనిని తన బహుళత్వం, భిన్నత్వం- అదే ఒకే భారతదేశ స్ఫూర్తిని జరుపుకుందాం- అంటూ నిస్వార్థంగా సేవలు చేస్తున్న మోడీకి అండగా ఉంటేనే స్వాతంత్ర్య ఫలం అందుకోగలం. ‘తమ జీవితాలను కర్పూరంలా అర్పణం అర్పించి, ఆ విధంగా స్వాతంత్ర్య వాయువులను మనం పీల్చుకోగలిగేలా చేసిన వారిని గుర్తుంచుకుందాం. అభివృద్ధి పథంలో దేశాన్ని ముందుకు తీసుకుని వెళ్ళడానికి కలిసికట్టుగా నిలిచి, వ్యవహరించడం మనందరికీ ఎంతో ఆవశ్యకం. కానీ ఏకచ్ఛత్రాధిపత్యంగా సాగిన జాతీయ పార్టీ నియంత విధానం దేశ స్వాతంత్ర్య ఫలాలను అందుకోకుండా చేసాయ్. వల్లభాయ్ పటేల్ తరువాత ధీమంతులూ, స్వార్థరహితుడవైన మోడీ ధీరుడవై నిలువగలవని ఆశిస్తున్నాం.

\- ప్రముఖాంధ్ర



జాతీయ జెండాతో ఖాదీ బంధం

**ముప్వన్నెల ఖద్దరు ముచ్చటతో
ముద్దులొలికే జాతీయ జెండా!
రూపక శిల్పి పింగళి వెంకయ్య
మన తెలుగువాడే.**

నూలుని వడికి తయారుచేసే ఖద్దర్‌ని మనదేశంలో కేవలం వస్త్రంగానే చూడరు. స్వాతంత్రోద్యమానికి ఖద్దర్‌కీ మధ్య విడదీయరాని బంధం ఉంది. ఖద్దర్ ఆధారంగా మహాత్మాగాంధీ ఉద్యమానికి ఊపిరి పోశారు. స్వాతంత్రోద్యమంలో కీలక పాత్ర పోషించిన ఖద్దర్ 70 ఏళ్ల స్వతంత్ర దేశంలో దశలవారీగా పలు మార్పులకు లోనైంది. ఖద్దర్‌ను కేంద్రంగా చేసుకుని ఈ మధ్య పలు కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆ విశేషాలే ఇవి...

ఖద్దర్ జెండాతో వందనం

గుర్గావ్‌లోని 'నగావ్ బెంగాలి గర్ల్స్ హైస్కూల్ అమ్మాయిలు ప్లాస్టిక్‌తో కాకుండా ఖాదీతో తయారు చేసిన జాతీయజెండా చేతబూని ఎకోఫ్రెండ్లీ శుభాభినందనలు తెలుపుతున్నారు. 'ఇలా మేమెందుకు ఆలోచించామంటే సాధారణంగా స్వాతంత్ర్య దినోత్సవం పూర్తయ్యాక ప్లాస్టిక్ జెండాలన్నీ ఎక్కడివక్కడే వెదజల్లి ఉంటాయి. ప్లాస్టిక్‌తో తయారు చేసిన వాటివల్ల పర్యావరణానికి హాని కలుగుతుంది. ఖాదీ అనేది స్వాతంత్ర్య పోరాటానికి గుర్తు. కాబట్టి ఆ రోజున ఖాదీ జెండాపట్టుకుంటే సార్థకత' అంటున్నారు ఈ అమ్మాయిలు.

పూర్వం పెద్దవాళ్లు మాత్రమే ఎక్కువగా ఖాదీ ధరించేవారు. కాని నేటితరం డిజైనర్లు వీటివైపు దృష్టిపెట్టడంతో ఖాదీ వస్త్రాలకు క్రేజ్ పెరిగింది. ఖాదీ సిల్క్‌తో తయారుచేసిన డ్రస్‌లు వేసుకుంటే రాజసం ఉట్టిపడుతుంది అంటున్నారు ఫ్యాషన్ డిజైనర్లు. పాశ్చాత్యులు ఖాదీ పట్ల మక్కువ చూపుతుండగా మన ఖాదీని మనం దూరం చేసుకుంటే ఎలా అనేది వాళ్ల ప్రశ్న. ఖాదీ వస్త్రంతో స్కర్ట్‌లు గౌన్లు, షర్ట్‌లు కుర్తాలు, మోకాలి పొడవు కుర్తాలు ఇలా ఎన్నో ఉంటున్నాయి. చీరల గురించి ప్రత్యేకంగా చెప్పేదేముంది. ఖద్దరు లేదా చేనేత వస్త్రాల పట్ల యువత క్రేజ్ పెంచుకుని వాటిని వేసుకోవడం వల్ల మనం మన సంప్రదాయ మూలాల్లోకి వెళ్లినట్లు ఉంటుంది అంటున్నారు.

ఆజాది కే రంగ్

కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జవాన్లకు కృతజ్ఞతలు చెప్పేందుకు వినూత్నమైన ఆలోచన చేసింది. ఖాదీబోర్డు మీద సందేశాలు రాసి జవాన్లకు పంపమంటోంది. స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా దేశవాళి వస్త్ర పరిశ్రమ ప్రేరణ కలిగిస్తుంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్ర రాజధానులు కలుపుకుని 70 లొకేషన్లలో ఈ ఏర్పాటు చేశారు. ఖాదీ బోర్డు మీద సందేశాలు రాయడం లేదా అరచేతిని జెండా రంగుల్లో ముంచి ముద్రవేయడం వంటివి చేయాలి. ఢిఫెన్సు మినిస్ట్రీ కూడా 'ఆజాది కే రంగ్' పేరిట వీడియో రూపొందించినట్లు తెలుస్తోంది.

ఖాదీ డే

ఖాదీని చల్లని తల్లి అనొచ్చు. ఎంతో ప్రత్యేకతను కలిగిన ఖాదీని ప్రపంచ వ్యాప్తంగా పాపులర్ చేసే ఆలోచన భారత ప్రభుత్వానికి ఉంది. అందులో భాగంగానే ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ రీతు బెరి త్వరలో 'ఖాదీ డే'ను ప్రకటించాలి అంటున్నారు. ఖాదీకి ఒక రోజు కేటాయించడం వల్ల మహాత్మాగాంధీకి నివాళి అర్పించుకోవచ్చు అనేది ఆమె భావన. ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమీషన్‌లో సలహాదారుగా ఉన్నారు. రితుకి ఫ్యాషన్ పరిశ్రమలో 25 యేళ్ల డిజైనర్ అనుభవం ఉంది. జాతీయ అంతర్జాతీయ సెలబ్రిటీల డిజైనర్.

కొంతకాలం క్రితం 'ఐవేర్ హ్యాండ్లూమ్' అనే హ్యాష్‌టాగ్‌తో సోషల్ మీడియాలో ప్రచారం ప్రారంభమైంది. మొత్తం మీద టెక్నాలజీ, పెరిగిన అవగాహన వల్ల ఖద్దర్ ఫ్యాషన్ ప్రపంచంలో తనకో విశిష్ట స్థానాన్ని ఏర్పరచుకుంటుందనే చెప్పాలి.

స్నాతకోత్సవానికి...

విద్యార్థులలో జాతీయ భావం కలిగించేందుకు ఐఐటి ముంబాయి స్నాతకోత్సవం కోసం 8500 రోబ్స్‌ను ఆర్డర్ చేసింది. గుజరాత్ విశ్వవిద్యాలయం తరువాత ప్రముఖ ఐఐటి ఇనిస్టిట్యూట్ అధికార వర్గాల హృదయాల్లో ఈ ఆలోచన తలెత్తింది. దాంతో మూడువేల ఐదొందల ఉత్తరీయాలు ఈ విద్యా సంస్థ ఆర్డర్ చేసింది. ●

Compliments from
Sri Krishna Bhat
When you come to
Holy Pilgrimage Centre Tirupati & Tirumala
WOOD SIDE ANNEXE
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.
WOODSIDE
HOTEL WOODSIDE
E.Car Street, Tirupathi. Ph : 2284464

Lovely Stay at Holy Tirupathi *The Gateway of Lord Balaji*
HOTEL MAYURA
204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :

సురవరం ప్రతాపరెడ్డి రూపులు దిద్దిన అపురూపపు గ్రంథం ఆంధ్రుల సాంఘిక చరిత్ర

ఎవరూ ఇంత చక్కగా మన తాత ముత్తాతలు గూర్చి వివరించలేదంటూ ఆంధ్రప్రభ సంపాదకీయములో నార్ల వేంకటేశ్వరరావు ప్రస్తుతించారు

ఏ రాజు ఎప్పుడు పాలించాడు? ఎక్కడ? ఏవిధంగా? అతడు ఎన్ని యుద్ధాలు చేశాడు? ఎవరెవరిని గెలిచాడు? లేదా, ఎవరిచేతిలో ఓడిపోయాడు? అతడెందరిని వివాహ మాడాడు? బహుభార్యాత్వపు సాధకబాధకాలను ఏ విధంగా ఎదుర్కొన్నాడు– ఇదే ఇప్పటి వరకు ఘన చరిత్ర.

"నా విష్ణుః పృథ్వీపతిః" అని విశ్వసించబడినంతవరకు రాజుల రాజస్థానాల కథలే, రాణుల, రాణివాసాల గాథలే చరిత్ర కావడం ఎవ్వరికీ ఎబ్బెట్టుగా తోచలేదు!



కాని, రాజు దైవాంశసంభూతుడన్న గుడ్డి నమ్మకం రోజులు పోయాయి. చివరకి జపానులో కూడా (మొన్నటి యుద్ధము తర్వాత) హిరోహిటో సయితం రాజు సాక్షాత్తు అపరబ్రహ్మ స్వరూపుడన్న మూఢ విశ్వాస ప్రాబల్యం సడలింది.

రాజుల రోజులు పోయినందున, ప్రజలే రాజులౌతున్నం దున, చరిత్ర స్వరూపమే మారిపోవాలి. ఇక మీద చరిత్రకారులు మనకు చెప్పవలసింది ముసలిమగడు రాజరాజనరేంద్రుని పడుచు పెళ్లాం చిత్రాంగి సవతి కుమారునిపై కన్ను వేసిందో, లేదో– ఈ సంగతి కాదు. ప్రతాపరుద్రుని ఉంపుడకత్తె (ప్రతాపరుద్రుని ఉంపుడుకత్తె చరిత్రను 'ఆడుదురు నాటకంబుగ నవనిలోన' అన్నాడు క్రీడాభిరామకర్త) విషయమై కాదు. కృష్ణదేవరాయల దేవేరుల విషయమై కాదు; ఆ దేవేరుల మధ్య వివాదాలను గురించి అంతకంటే కాదు.

ఈ ప్రజాయుగంలో వెలువడవలసినవి ప్రజాచరిత్రలు. వీటికే మరొక పేరు 'సాంఘిక చరిత్రలు'.

నామమాత్రానికి మనదేశంపై ప్రస్తుతం బ్రిటీష్‌రాజులు మిగిలివున్న పెద్దరికం కూడా తొలగిపోనున్న ఈ సమయంలో, కొన్ని శతాబ్దాల తర్వాత ఆంధ్రులకు తిరిగి ఒక ప్రత్యేక ప్రభుత్వం ఏర్పడనున్న ఈ సమయములో ఇట్టి ఒక చరిత్ర గ్రంథం వెలువడ్డం ఎంతైనా సమయోచితం.

దాదాపు వెయ్యి సంవత్సరాలపాటు (క్రీస్తు శకం 1050 నుంచి 1907 వరకు) తెలుగుజాతి ఏ విధంగా బ్రతికిందో ఈ చరిత్ర కళ్ళకు కట్టినట్లు చిత్రిస్తున్నది. మన తాత, ముత్తాత, లెట్టివారై యుండిరో, మన అవ్వలు ఎట్టి సొమ్ములు దాల్చిరో, యెట్టి అలంకరణములతో నుండిరో మన పూర్వులే దేవరలను గొలిచిరో, ఏ విశ్వాసాలు కలిగియుండిరో, ఏ యాటపాటలతో వినోదించిరో, దొంగలు, దొరలు, దోపిడీలు చేసినప్పుడు క్షామాదీతి బాధలు కలిగినప్పుడెటుల రక్షణము చేసుకొనిరో, జాడ్యాలకే చికిత్సలు పొందిరో, ఎట్టి కళలందు ప్రీతికలవారై యుండిరో, ఏయే దేశాలతో వ్యాపారాలు చేసిరో" ఇట్టి అనేక విషయాలు ఈ చరిత్రలో వర్ణితం.

తప్పెట్లు, కాహళములు, కాలికొమ్ములు, డమాయికాలు, బూరలు, శంఖములు, సన్నాయిలు, డోళ్లు, రుంజలు, చేగంటలు– ఇవి చేరగా ఏర్పడినదే మన పూర్వీకుల మిలటరీ బ్యాండ్.

తుమ్మెద పదాలు, పర్వతపదాలు, శంకరపదాలు, నివాళి పదాలు, వాలేశుపదాలు, వెన్నెల పదాలు, రోకటి పాటలు, బొమ్మమ్మలాటలు, కోలాటం, గొండ్లి, చిందు, జక్కిణి, పేరణీ, ప్రేంఖణము, ఉప్పెన పట్టెలాట, బొంగరాలాట, కోళ్లపందెము, పులిజూదం, పచ్చీసుసిడి– ఇవి మన పూర్వీకుల గాన నృత్య క్రీడా వినోదాలు.

ముక్కెర, నెత్తిబిళ్ళలు, దండెకడెములు, వంకీలు, జోమాల దండలు, తాటంకములు, ముత్యాల కమ్మలు, కాంచీ నూపరకంకణములు, త్రిసరములు, మొరవంక కడియములు, వడ్డాణము, ముక్కునత్తు– ఇవి మన అవ్వలు పెట్టుకొన్న నగలలో కొన్ని మాత్రం.

వెంజావళి, జయరంజి, మంచుపుంజము, మణికట్టు, భూతిలకము, శ్రీవన్నిమ, చీని, మహాచీనీ, పట్టుపొంబట్టు, నెరపట్టు, వెలిపట్టు, పచ్చనిపట్టు, నేత్రంపుపట్టు, సంకుపట్టు, భావజతిలకము, రాయశేఖరం రాయవల్లభం, వాయుమేఘం, గజవాళం, గండవరం, వీణావళి–ఇట్టివన్నీ ఒకనాడు మన తెలుగునాట నేయబడిన వస్త్ర విశేషాలు.

ఒకనాడు మన తెనుగుసీమలో ప్రతి బ్రాహ్మణ గృహంలో ఒక గ్రంథాలయం వుండేది. ధనికులు తివాసీలపై కూర్చొనేవారు. 'బురునీసు దుప్పట్లు కప్పుకునేవారు. అప్పులవారిని 'పొగడదండల'తో శిక్షించేవారు.. దొంగలను పట్టి 'బొండకొయ్యలో' వుంచేవారు. రెండవ భార్యను చేసుకుంటే ఆమెకు 'సవతి కడెము' తొడిగేవారు. యుద్ధంలో ఓడిపోయినవారు 'ధర్మధార' పట్టేవారు. తాంబూలం వేసుకోవడానికి 'పాన్ దానులు' ఉపయోగించేవారు; రైతులు ఏరు వాకను, 'వింతటి పండుగను' చేసుకొనేవారు. కరణాలు 'వహి' అనే పుస్తకాలలో లెక్కలను వ్రాస్తుండేవారు. పీనుగులను కాల్చిన బూడిద మత్తుమందుగా పనిచేస్తుందని దొంగలు నమ్ముతుండేవారు. ఈ రీతిగా శ్రీప్రతాపరెడ్డిగారు వ్రాసిన 'సాంఘిక చరిత్ర' మన పూర్వీకుల జీవిత విధానాన్ని గురించి చెప్పే విశేషాలు అంతేలేదు.

ఈ చరిత్ర దాదాపు ఒక జీవిత కాలపు పరిశోధనా ముక్తాఫలం. సాంఘిక చరిత్రకు పనికివచ్చే గ్రంథాల సంఖ్య పరిమితమైనా, ఇందుకు శాసనాలు ఉపయోగం నామమాత్రమైనా, ఆచార వ్యవహారాలకు, క్రీడా వినోదాలకు సంబంధించిన అనేక విషయాలను క్రోడీకరించిన గ్రంథము ఇదే! ●

SRI RAJARAJESWARI JEWELLERY
The Oldest Jewellery Shop in Pondy Bazaar
81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653
The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation

Beautiful City - Beautiful Hotel

Foreverar your Serivice in the Heart of Visakhaparnam
HOTEL Daspalla
Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

68 ఏండ్ల పడుచువాడు! 64 కళలలోనూ ఆరితేరినవాడు! ఆడంబర మెరుగనివాడు! సాహితీవరప్రసాదుడు

కె.ఐ. వరప్రసాద్‌రెడ్డి!



జీవితమెంతో విలువైనదిరా! ప్రతీ నిముషమూ విలువైనదిరా- అన్నాడు నా ఆప్తమిత్రుడైన దాశరథి. ఆయన తెలుగు సినిమా కవిగా- అన్నపూర్ణా సంస్థలో మేడమెట్లు దిగుతూ, నన్నో మెట్లు ఎక్కిస్తూ- గోటేటీగారూ! మీరంటే నాకెంతో ఇష్టం. కొత్తగా సినిమారంగంలో కవిగా ప్రవేశించిన వారిని ప్రోత్సహించడంలో- గోటేటికి సాటేటి- గోటేటి శ్రీరామారావే! ఆయన వాణి మధురవాగ్వాణి అనేవారు. అప్పుడు నేను 'సినిమా-సాహితీరంగ వాగ్వాణిగా 'మధురవాణి' మా(న)స పత్రిక సంపాదక బాధ్యతలు నిర్వహిస్తుండేవాణ్ని.

సంపాదక శీర్షికమైన 'మధురవాణి', పేరుకు దిగువన 'మృదుమధుర భావాల ముంచి తేల్చేదవు! మధువు గ్రోలిన చందాన మత్తునుంచెదవు! మధుర వాగ్వాణి నిను గొల్తునే మధురవాణీ'- అన్న మకుటం పదాలు చదివిన తరువాతనే 'మధురవాణి' చదవడం ప్రారంభిస్తానేవారు. దాశరధి మధుర భాషణే కాని, ముఖస్తుతి భాష కాదు అనేవారు.

అలానే కె.ఐ. వరప్రసాదరెడ్డిని ముఖస్తుతిగా చెప్పడం లేదు.

పర్వత రాజతనయను 'ఓమా, ఉమా' అని పిలిచాడట పరమేశ్వరుడు.

భారత సాంప్రదాయం 'అమ్మ'కు ముఖస్థానమిచ్చింది. మాతృస్థాన ఉన్నతోన్నతి కోసం, ప్రకృతినీ, పుడమినీ మనం 'మాత'లుగా కొలుస్తున్నాం. భారత సాంప్రదాయంలోనే పంచమాతల కొక ప్రత్యేక స్థానం యిచ్చింది. మాతృస్థానానికి అత్యంత గౌరవమిచ్చే సాంప్రదాయం ఇంకా ఆంధ్ర దేశంలో కొనసాగుతుందని చెప్పడానికి వరప్రసాదరెడ్డి- ఇటీవల చిత్తశుద్ధితో జరిపిన 'మాతృవందనం' విశిష్టతను చెప్పుకోవాలి. తన పుట్టినరోజు 17 నవంబర్ సందర్భంలో గృహిణీమణులైన తల్లులను పిలిపించి సత్కరించారు. ఆయన అంతస్థుకూ, గౌరవానికీ తగినట్లు తన పుట్టిన రోజును వైభవంగా జరుపుకోవచ్చు. అసంఖ్యాకులైన ఆయన శ్రేయోగాములూ జరిపించనూవచ్చు. ఇట్టి అట్టహాసములేవీ లేకుండా- మాతృ సమానులందర్నీ సత్కరించడంలో ఆయన సహృదయత కనిపిస్తుంది. నిజానికిదే నిజ మాతృవందనం.

68 సంవత్సరాల నవయవ్వన యువకుడు కె.ఐ. వరప్రసాదరెడ్డి నిండు నూట ఇరవై సంవత్సరాలు ఆయురారోగ్య ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఏడుకొండల ఱేడును ప్రార్థిస్తున్నాను; 84 ఏండ్ల పెద్దవానిగా ఆశీర్వదిస్తున్నాను. ●

శ్రీ భగవద్గీతా మకరందం!

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

102

పదునెనిమిదవ అధ్యాయము - మోక్ష సన్న్యాస విభాగయోగము

37. యత్తదగ్రే విషమివ పరిణామేఽమృతోపమమ్
తత్సుఖం సాత్త్వికం ప్రోక్త మాత్మబుద్ధి ప్రసాదజమ్

వ్యాఖ్య : అధ్యాత్మక్షేత్రమున సాధకునకు అభ్యాసకాలమందు ప్రారంభమున బ్రహ్మనిష్ఠ, ధ్యాన, వైరాగ్యాలు ఒకింత కష్టముగా తోచవచ్చును. కాని అభ్యాసము, సాధన పూర్తియగుకాలమున అమృతతుల్యముగ నుండును. ఆత్మసుఖము నవి కలుగచేయును- అని యిచట వచింపబడినది. కావున సాధనదశలోగాని, అభ్యాసకాలములోగాని ఎవరికైనను కష్టము కలిగినదో, విసుగు జనించినదో, అధైర్యపడక అది వాస్తవముగ బాధ కాదనియు, పరిణామమున అనంతానందము కలుగుననియు నిశ్చయించి సాధనను విడనాడని ధైర్యముతో కొనసాగించవలెను. కనుకనే 'విషమివ' అని చెప్పిరేకాని 'విషమ్' అని చెప్పలేదు. అనగా ఆ ప్రారంభ కష్టము విషమువలె తోచునే గాని వాస్తవముగా విషముగాదని భావము. ఇచట ప్రయోగించిన 'ఇవ' అను పదమునందు గొప్ప అర్థము కలదు. 'బాధవలె తోచునేగాని, బాధకాద'ని ఆ పదమువలన స్పష్టమగుచున్నది. ఆ తాత్కాలిక బాధకైనను కారణము జన్మార్జితములైన పాపవాసనలకును, ఆధునిక పుణ్యవాసనలకును, మధ్యగలుగు సంఘర్షణమే యగును. పుణ్యవాసనలు బలమై, పాప వాసనలను తొలగద్రోయునపుడు అవి వెడలి పోవుచు జీవుని గిల్లిపోవును. ఆ నొప్పియే ఈ 'విషమివ' అనుదాని యర్థము. అదియే జీవుని ప్రారంభబాధ. వాస్తవముగ అది బాధకాదు. అనుపమ సుఖమునకు నాందియే యగును.

ఒకానొక రోగమునకు 'వేప ఉండ' అనుమందు ఇచ్చుదురు. అది చేదుగానున్ననూ ఆరోగ్యమును గలుగజేయును. ఔషధము సేవించునప్పుడు అప్రీతిగానున్నను, బలవంతముగా నైనను ఆరోగ్యము కొరకు సేవించవలసినదే, ఒక ఱాయి దేవ విగ్రహముగా మారుటకు మొదట ఉలి దెబ్బలు తినునట్లును, బంగారము శిరోభూషణముగా మారుటకు స్వర్ణకారుని సుత్తిదెబ్బలు తినునట్లును, అనంతమగు బ్రహ్మానందము ననుభవించుటకు ముందు జీవుడొకింత త్యాగము చేయవలసియుండును. అట్లు అల్ప సుఖమును వదలునప్పుడు ఒకింత దుఃఖము కలుగవచ్చును. అనేక జన్మల నుండి ఆ విషయ సుఖములను బంధువులు జీవుని హృదయగేహములో నివసించుచున్నారు. వారు పోవునపుడు బంధువియోగమందువలె తాత్కాలిక ఆవేదన కొంత కలుగును. అంతమాత్రముతో సాధకుడు బెదరిపోరాదు. కొంత ఓపికపట్టి సాధనను విడువక కొనసాగించినదో ఆ కష్టకాలము తొలగిపోయి సుఖకాల మేతెంచును.

ఒక విద్యార్థి దశలో రేయింబవళ్లు కష్టపడి చదువును. తదుపరి ఉద్యోగకాలమందు సుఖించును. అట్లే ఆధ్యాత్మరంగమున ఇంద్రియాదులను నిగ్రహించునపుడు, అంతర్యుద్ధఫలితముగా కొంత ప్రయాస కలిగినపుడు దానిని సహించుకొని ముందునకు సాగిపోవలెను. అంతియేకాని, భయపడి సాధనను విరమించరాదు. కనుకనే భగవానుడిచట సాత్త్వికసుఖము యొక్క నిజస్థితిని తెలుపుచున్నారు. విషరూప దుఃఖములో అమృతరూప సుఖము యొక్క బీజములున్నవని సెలవిచ్చిరి. తాత్కాలిక కష్టరూపమగు ఆ విషము నెట్టైనను దిగమ్రింగినచో వానిలోనగల అమృతబీజములపుడు మొలకెత్తును. ఇది విషమువలె నున్నది కదాయని పారవేసినచో దానిలోని అమృతబీజములను గూడ జనులు పోగొట్టుకొనినవారగుదురు. కాబట్టి సాధకు లివ్విషయమున కడుజాగరూకులై యుండి భగవానుని ఈ అమూల్యోపదేశము జ్ఞప్తియందుంచుకొని అనంతాత్మసుఖము తమకై వేచియున్నదని భావించి, కష్టసహిష్ణువులై, త్యాగశీలురై, సాధనను విడువకుండ చేయుచునే యుండవలెను. కనుకనే 'కశ్చిద్ధీరః'- ఏ ఒకానొక ధీరుడో (అన్ని కష్టములనోర్చుకుని) ప్రత్యగాత్మను చూడగలడనది ఉపనిషత్తులలో చెప్పబడినది. శ్రీ బుద్ధదేవుడు, శ్రీ రామకృష్ణపరమహంస మున్నగువారి సాధన కాలజీవితములను చూచినచో ఈ సత్యము బోధపడగలదు. మఱియు 'అమృతోపమమ్'- అమృతమునుబోలి అని యిచట చెప్పుటయు చాలా సమంజసముగా నున్నది. ఏలయనిన, ఆత్మ సుఖము, దైవసుఖమును దేవతల అమృతమును పోలినదేకాని, జడమగు ఆ దేవతల అమృతము కాదు. దానికంటే ఎన్నికోట్ల రెట్లు అధికశక్తివంతమైనదది. దేవతల యొద్దగల అమృతము స్థూలదేహమునకు కొంతకాలము మృతిలేకుండ నివారించును. కాని ఈ ఆత్మ సుఖరూపమగు అమృతము. శాశ్వతముగ జననమరణ సంసార ప్రవాహము నుండి జీవిని తప్పించివేయును.

'ఆత్మబుద్ధి ప్రసాదజమ్'- ఆ సాత్త్వికసుఖము (ఆత్మసుఖము) యెట్లు కలుగగలదు? బుద్ధి నిర్మలముగానున్నచో, విషయదోషము లెవ్వియు లేకయుండినచో, నిర్మల దర్పణమున ప్రతిబింబమువలె ఆత్మసుఖము అందు గోచరింపగలదు. అనుభూతము కాగలదు. కాబట్టి సుఖము నపేక్షించువారు మొట్టమొదట తమ బుద్ధిని నిర్మలముగా నొనర్చుకొనవలెను. 'మోక్షమెచటనున్నది. సుఖమెచటనున్నది' అని కొందఱు ప్రశ్నించుదురు. దానికి భగవానుడిచట సమాధాన మొసంగిరి. మోక్షము, దైవసుఖము ఆకాశములో లేదు. పాతాళములో లేదు. నిర్మలమగు తన బుద్ధియందే కలదు. ఈ యర్థమునే శ్రీ వసిష్టమహర్షియు శ్రీరామచంద్రున కిట్లు బోధించిరి-

నమోక్షో నభసః పృష్ఠే పాతాలే న చ భూతలే
మోక్ష హి చేతో విమలం సమ్యగానవిబోధితం (శ్రీవిష్ఠగీత)

38. విషయేన్ద్రియ సంయోగా ద్యత్తదగ్రేఽమృతోపమమ్
పరిణామే విషమివ తత్సుఖం రాజసం స్మృతమ్

వ్యాఖ్య : విషయ సుఖము తాత్కాలికమైనది. క్షణికమైనది. ఇంద్రియములకు విషయములకు సంయోగము కలిగినపుడే ఆ సుఖముదయించును. మఱల వెంటనే పోవను. మఱియు ప్రారంభములో అమృతముపగిది సుఖముగా తోచినను, పర్యవసానమున విషమువలె దారుణ దుఃఖరూపముగ పరిణమించునని ఇచట తెలుపబడినది. దీనిని బట్టి రాజససుఖము ప్రారంభమున జీవులకు అమృతమువలె తోచు సుఖము అమృతము కాదనియు, పయోముఖవిషకుంభస్థవిషమే యనియు తెలియుచున్నది. విషరూపమగు ఆ అమృతము మహా ప్రమాదకరమైన వస్తువు. ఏలయనిన ఆ అమృతములోన విషబీజములు కాపురముండును. ఆ సుఖమందు దుఃఖబీజములు నివసించును. కాబట్టి అమృతమును విడనాడినచో, దానిలో దాగియున్న విషబీజములను గూడా స్వీకరించవలసివచ్చును. కావున ముముక్షువులు దృశ్యవిషయముల ద్వారా తమకేదైన సుఖము గలిగినపుడు అది దుఃఖగర్భితమని, చేపయొక్క ఎరలోపల నుండు గాలము వంటిదని నిశ్చయించి దానిని త్యజించివేయవలెను. ఆ సుఖము ఈ జీవితమునేకాక అనేక భావికాల జీవితములను గూడ నాశనము చేయును. కనుకనే భగవానుడు కరుణించి సాధకులకిచట హెచ్చరిక చేయుచున్నారు. ఆ దృశ్యసుఖముల యొక్క అసలు రంగును గీతాచార్యులు బయటపెట్టుచున్నారు. 'మోసపోకుడు' అని సలహానిచ్చుచున్నారు. అజ్ఞాను లీసత్యము నెఱుగక తృణావృతకూపములమాడ్కి కానవచ్చు శబ్దాది దృశ్యవిషయములనే సేవించి అగాధ సంసార కూపములో పడిపోవుచున్నారు.

భగవానుని ఈ వాక్యములు జీవులకు అంధకారమునందు వెలుగునిచ్చుచున్నవి. జగత్తు యొక్క వాస్తవ స్వరూపమును బోధించుచున్నది. పైపై తళుకుబెళుకులకు మోసపోకూడదను విషయమును తెలియబఱచుచున్నవి. కావున ముముక్షువుల విషయ సుఖమువలన కలుగు ఈ కీడును గుర్తెఱిగి, ఇంద్రియములకు మనస్సునకు ఆయా విషయములతో నేమాత్రము సంయోగము కలుగకుండ చూచుచుండవలెను. ఒక వేళ జన్మాంతర సంస్కార ప్రాబల్యముచే ఇంద్రియములు బయటకు విషయములపై పరుగెత్తినను, వానిని వివేకముతోనే వెనుకకు లాగి ప్రత్యాహరించి ఆత్మయందు నెలకొల్పవలెను.

(తరువాయి వచ్చే సంచికలో)

చందమామ, చలనచిత్ర సామ్రాట్ నాగిరెడ్డి తిరిగి జన్మిస్తాడా?

ఆయన వల్లనే సినిమా రంగం అభివృద్ధి చెందింది. ఆయన పోవడంతోనే తెలుగు సినిమా వెలుగు తగ్గింది. అయితే- మధ్యతరగతి ప్రజల కోసమే ఆయన స్థాపించిన విజయా ఆసుపత్రి స్వైరవిహారం చేస్తూంది.- స్థితప్రజ్ఞుడైన ఆయన బి.నాగిరెడ్డి.

ఆయన రోగగ్రుగ్మత మరణాన్ని ఎదుర్కోలేకపోయాడు. కానీ- యెందరో పేదలూ మధ్య తరగతి జనులను ఆయురారోగ్య సంపన్నులుగా చేయడానికి అహరమూ కష్టపడి విజయా హెల్త్ సెంటర్, విజయా హాస్పిటల్ నెల కొల్పాడు.

ధూసిధూళులు కంటపడుతున్నా, వృద్ధాప్యం వెంటపడ్తున్నా లెక్క చేయ కుండా విజయా హెల్తు సెంటర్ను బృందావన మందారంగా తీర్చిదిద్దిన ఖ్యాతి బి. నాగిరెడ్డి ఒక్కనికే దక్కింది.

అన్యులకు సాధ్యంకాని అనంత మైన కృషి, సూర్యచంద్రుల వెల్తురుకు అతీతమైన ఆరోగ్యధామం విజయా చికిత్సాలయ నిర్మాణం. దక్షిణ భారత దేశంలోనే ఇంతటి అందాల్ను అపూర్వ చికిత్సలను అందించే వైద్యాలయం.

నాగిరెడ్డి ఏ నిర్మాణం చేబట్టినా దగ్గరుండి పర్యవేక్షిస్తూ చేస్తాడు. దయార్ద్ర గుణమూ ఆయనిదే! దర్పమూ ఆయనిదే! ఆయన వడపళనిలో ఆసియా ఖండం గర్వించతగ్గ 13 ఫ్లోరుల స్టూడియోను నిర్మించారు. ఔట్‌డోరు షూటింగుకై సాతనూర్ డామూ, మైలేడీ గార్డెన్స్ (సెంట్రల్ స్టేషన్ వద్ద ఉంది) మైసూరు బృందావనం అందచందాలన్నీ తమ స్టూడియోలోనే ఉండే సౌకర్యం సమకూర్చారు. అధునాతనమైన రికార్డింగులన్నీ ఆయన స్టూడియోలోనే జరిగేవి. దిలీప్‌కుమార్ వంటి నట దిగ్గజానికి వసతి సౌకర్యంగా- ఓ అందమైన వాసభవనాన్ని తన స్టూడియోలోనే నిర్మించారు. తెలుగు సినిమా రంగానికి నెలవేతనములపై నటులను ప్రోత్సహించి వారి స్టార్‌డమ్‌కు కారణమయ్యారు. వారి వద్ద పెరిగిన నటులే ఆయనకు పంగనామాలు పెట్టినా చలించలేదు. తిరుమల తిరుపతి దేవస్థానముల అధ్యక్షునిగా తిరుమల అందచందాలను తీర్చిదిద్దిన ఘనుడాయన.

ఆసియాలో అతి పెద్దదైన ప్రింటింగు ప్రెస్ బి.ఎన్.కే ప్రెసను ఆయనే పెంపు చేసారు. బొంబాయి నుంచీ రాజ్‌కపూర్ వంటి ప్రముఖులు నిర్మించిన చిత్రాల వాల్‌పోస్టర్లు కూడా బి.ఎన్.కే. ప్రెస్‌లోనే అచ్చుకావడం గొప్ప విశేషం. ఆయన ప్రారంభించిన 'చందమామ' పిల్లల మాసపత్రిక 14 భాషల్లో వెలువరించిన ఘనత ఆయనకే దక్కింది. ఆ సాహసాన్ని యింతవరకూ ఏ ఒక్కరూ సాహసించే ప్రయత్నం చేయలేదు.

ఆనాడు మహోన్నత దశలో ఉన్న జెమినీ, ఏవిఎం స్టూడియోలను మించే విధంగా విజయా వాహినీ స్టూడి యోను 14 ఫ్లోరులతో తీర్చి దిద్దారు. తోడుపెట్టిన చిన్న మజ్జిగ చుక్కతో పాలు ఘట్టిపెరుగైనట్లు చక్రపాణి స్నేహంతో దృఢమై పటిష్టమైందా. ప్రాణంగా ప్రేమించిన చక్రపాణి మరణమూ, భార్యా వియోగమూ ఎంతగానో కృంగదీసింది. ఆయన మనుమడు (పెద్ద కుమారుడు ప్రసాద్ తనయుడు) విజయా లేబరేటరీస్ నుంచీ బయటకు వెళ్లి పోవడంతో లేబరేటరీస్ బోసిపోయింది. బి.ఏ. రామారావు లేకపోవడంతో విజయా గార్డెన్ పచ్చదనాన్ని కోల్పోయింది.

వ్యాపారాత్మక విధానంతోబాటు, వాత్సల్యభావం విపరీతంగా ఉండ దంతో నాగిరెడ్డి వ్యాపార విస్తృతి నలుదెసలా విస్తరిల్లింది.

వడపళని ఆంధ్రా హాలీవుడ్‌గా తీర్చినది నాగిరెడ్డి ఒక్కడే! ఆ వొక్కడూ లేకపోవడంతో హంపీ విజయనగర సామ్రాజ్యంలా వెలవెలా పోతున్నది.

మరల నాగిరెడ్డి వంటివాడు పుడ తాడా? ఆంధ్రా హాలీవుడ్‌గా వడపళని పునర్వైభవం చేకూర్చుకుంటుందా? చందమామ వంటి పత్రిక వస్తుందా- అనే ప్రశ్నలకు సమాధానం దొరకడం లేదు.

కానీ, ఎచ్చట ఆంధ్రా హాలీవుడ్ అంటూ పిలిపించుకోబడదన్నది వాస్తవం.

అమ్మహానుభావుని వంటి శ్రేయోమూర్తి లభించదన్నది సత్యం! ●

దినకరుడు పన్నెండు గంటలే మన చెంత ఉంటాడు.
చలువతేడు కూడా పన్నెండు గంటలే ఉంటాడు.
కానీ 12.12 = 24 గంటలూ శ్రమదమాదులు పడి,
విజయా హాస్పిటల్, విజయా హెల్తు సెంటర్లను
తీర్చిదిద్దినవాడు కాని ఆయన ఆరోగ్యాన్ని
ఆ ఆసుపత్రి తీర్చిదిద్దలేదు.

We Provide your comfortable Stay and Tasty Food Hospitality

b-d

Bhimas Deluxe Hotel

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)

34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

దివాకర్ల వేంకటావధాని

సౌజన్యం దివాకర్ల వారి సహజగుణం. వినయం వారి స్వభావం. ఆజానుబాహు రూపంలో గాంభీర్యం వెన్నంటి నడిచింది. ఎంతటి జఠిలమైన విషయాన్నైనా సరళంగా చేసి చెప్పేవారు. రచనలో మంచిని గ్రహించి చూపారు. ఎదుటి వ్యక్తిని మన్నించి గౌరవించారు. ఇటువంటి వ్యక్తి నూరు సంవత్సరాలకుగాని మరల జన్మించారనిపించారు.

ఆచార్య దివాకర్ల వెంకటావధాని వృత్తినే ప్రవృత్తిగా కలిగిన అవిశ్రాంత ఆచార్యులు. కావ్యాలను, పురాణాలను ఇతిహాసాలను సంపూర్ణంగా చదివిన పండితులు. నిరంతర ఉపన్యాసకులు. ఉపన్యాసాన్ని ఉద్యమంగా కొనసాగించారు. ఆంధ్ర సాహిత్య చరిత్రలో మునుపెన్నడూలేని 'వక్తృత్వ' యుగాన్ని ఆరంభించిన యుగకర్త.

వారి సహజగుణం సౌజన్యం, వినయం వారి స్వభావం. ఎంతటి జఠిల విషయాన్నైనా సరళంచేసి చెప్పారు. ఎటువంటి రచనలోనైనా మంచిని గ్రహించి చూపేవారు. ఎదుటి వ్యక్తిని మన్నించి గౌరవించారు. సాంప్రదాయ సాహితీమూర్తిగా వెలుగొందారు. ఇటువంటి వ్యక్తి నూరు సంవత్సరాలకుగాని మరల జన్మించరని పించారు. వారు 1912వ సంవత్సరం జూన్ 23న గురుపూర్ణిమ నాడు జన్మిం చారు. జూలై 15, 2011 వ్యాసపూర్ణిమ నాడు వారి శతజయంతి జరిగింది.

దివాకర్ల వారు ఆంధ్రవిశ్వవిద్యాలయం నుంచి ఎం.ఎ. ఆనర్సు పట్టాను పొంది 18 సంవత్సరాలు విశాఖపట్నంలో ఆంధ్ర వ్యాసకులుగా పనిచేసారు. 1951లో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో అధ్యాపకులుగా చేరి 1964లో శాఖాధ్యక్ష పదవిని చేపట్టారు. అప్పటి నుంచి 1973 వరకు ఆ పదవిలో ఉన్నారు. తదుపరి ఎమిరేట్స్ ప్రొఫెసర్‌గా యూజీసీ ఆచార్యులుగా ఉన్నారు. ఇలా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 27 సంవత్సరాలు కొనసాగారు. దివాకర్లవారు తెలుగు శాఖాధ్యక్షులుగా చేసిన కృషి మరువరానిది.

ఎనిమిది సంపుటాల ఆంధ్ర మహాభారత సంశోధిత ముద్రణను పూర్తి కావించారు. తెలుగు శాఖ విస్తృతికి వారు కావించిన ప్రయత్నం ఫలితంగా 1967లో ఓరుగల్లులో తెలుగు పోస్టు గ్రాడ్యుయేట్ కేంద్రం ప్రారంభమైంది. విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలయిన సాయం కళాశాలలో ఎం.ఎ. తరగతుల ఆరంభానికి కారకులయ్యారు. వారి కృషిఫలితంగా ప్రాచ్య విద్యా

నన్నయకు పూర్వము ప్రాచీన యుగంలోని తెలుగు భాషా స్వరూపము, శాసనాలు, సాహిత్య స్వరూపములను గురించి తెలుగువారికి తెలిపి తమ భాషా ప్రాచీనతను గూర్చిన ఆసక్తిని అవగాహనను కలిగించారు. నన్నయ అనువాద పద్ధతిని కూలంకషంగా విశ్లేషించారు. నన్నయ భారతమునే కాక తెలుగును ఆంధ్రీకరించిన పద్ధతిని కూడా పరిశోధించారు. వీరి సిద్ధాంత వ్యాసము 'ప్రఙ్నన్నయ యుగము'- 'నన్నయ భారతము' అను రెండు సంపుటాలుగా వెలువడింది.

ప్రణాళికలో భాగంగా ఎం.ఎ.ఎల్ డిగ్రీ పరీక్షలు ఆరంభం అయ్యాయి. ఈ డిగ్రీ పొందిన అభ్యర్థులు ప్రాచ్య కళాశాల అధ్యాపకులుగా నియమితులవడమే కాకుండా పరిశోధనలు చేసి పీహెచ్.డి. డిగ్రీ పొందగలిగారు. ఉన్నత పాఠశాల తెలుగు అధ్యాపకుల కోసం, కళాశాలల్లో కొత్తగా ఉద్యోగాలు పొందిన ఉపన్యాసకుల కోసం 'షార్ట్ సర్టిఫికేట్' కోర్సులు వారి కాలంలో ఆరంభం అయ్యాయి. వారు తమ వృత్తి నిర్వహణను ఎంతో శ్రద్ధతో ఆసక్తితో కావించారు. అధికారుల ఆదరణను, సహవాసుల సహకారాన్ని, విద్యార్థుల మన్ననలను పొందారు. తమ విశ్వాసాల విషయంలో రాజీపడకుండానే, అందరితో సర్దుకుని పోయే అసాధారణ సామర్థ్యాన్ని అలవరచుకున్నారు.

వాఙ్మయ పరిశోధకులుగా అవధానివారు 'ఆంధ్రనాటక పితామహుడు' సిద్ధాంత గ్రంథాన్ని రాసి బి.ఏ. హెచ్ఎమ్‌ఏ పట్టాని పొందారు. 'ఆంధ్ర వాఙ్మయారంభ దశ- నన్నయ భారతము'లపై విపులమైన పరిశోధన కావించి పిహెచ్‌డి పట్టాలని పొందారు.

గ్రంథ పరిష్కర్తలుగా వ్యవహరించి వారు ఆంధ్ర భాగవతమునకు రాసిన విపులమైన పీఠిక ప్రామాణికమైనది. వారు కేంద్ర సాహిత్య అకాడమీకిగాను 'పోతన' గురించి ఆంగ్లములోనూ తెలుగులోనూ కూడా వ్రాసిన 'భారతీయ సాహిత్య నిర్మాతలు' మాలికలోని గ్రంథం మిక్కిలి ప్రాచుర్యాన్ని పొందింది. పరిశోధకులుగా మాత్రమే కాక పరిశోధనా మార్గనిర్దేశకులుగా తమ వద్ద పరిశోధన కావించే విద్యార్థుల వ్యాసాలను వ్రాత పుస్తకాల వలె ప్రతి ఒక్క వాక్యమును పరిశీలించి పద నిర్దేశము కావించారు. వారి వద్ద పాడిబండ్ల మాధవశర్మ, పి.యశోదారెడ్డి వంటి పండితులు పరిశోధనను గావించారు.

కేవలము బోధనాచార్యులుగా మాత్రమే కాక విద్యకు సంబంధించిన అనేకాంశముల పట్ల దివాకర్లవారు ప్రత్యేకమైన శ్రద్ధను వహించారు. విద్యార్థులకు వ్యాస రచనా విధానమును నేర్పవలెనను ఉద్దేశముతో వారు 'వ్యాసావళి'ని మునుపే రచించారు. విద్యార్థులకు పాఠ్యాంశములను వివరణతో అందుబాటులో ఉండేవిధంగా ఎస్ఎస్ఎల్‌సీ నుండి ఐఏఎస్ వరకు రాసిన నోట్సు ఎందరో విద్యార్థుల భవిష్యత్తును తీర్చి దిద్దింది. వారు కళాశాల స్నాతకోత్తర సాహిత్య విద్యార్థులకు ఉపయుక్తంగా రాసిన 'ఆంధ్ర వాఙ్మయ చరిత్ర', 'సాహిత్య సోపానములు ఆకర గ్రంథములుగా అమూల్యముగా ప్రసిద్ధిని పొందాయి. 'సాహిత్య సోపానములు' ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమానాన్ని పొందింది. 'ఆంధ్ర వాఙ్మయ చరిత్ర' ఇతర భాషలకు అనువాదమయింది.

అధ్యాపకులుగా దివాకర్లవారు బోధనామార్గంలోనూ, గురుశిష్య సంబంధ బాంధవ్యాలలోనూ కొత్త ఒరవడిని నెలకొల్పారు. వారు తరగతిలో పాఠాన్ని పుస్తకం చూడకుండా చెప్పడం ఒక విశేషమైతే, కావ్యమైనా, వ్యాకరణమైనా సూక్ష్మాతి సూక్ష్మ విషయాలకు కూడా వివరణ ఇస్తూ అనుబంధంగా అనేక శ్లోకాలను శాస్త్ర రహస్యాలను ఉటంకిస్తూ, సాగిపోతూనే విద్యార్థుల నాడి నెరిగి వారికి విసుగు కలుగకుండా ఛలోక్తులను విసిరి వారికి స్ఫూర్తిని కలిగించారు. విద్యార్థులను వారు పుత్రవాత్సల్యంతో చూసారు. 'మీరు' అని సంబోధిస్తూనే ఎంతో సన్నిహితంగా మెలగి, ఒకానొకప్పుడు వైయక్తిక కష్టాలను తెలుసుకుని ఆశ్రయదాతగా వ్యవహరించారు. కేవలం విద్యాభ్యాసన కాలంలో మాత్రమే కాక తదుపరి వారికి ఉపాధి మార్గం చూపి జీవితంలో ఉన్నతికి కారకులయ్యారు. విద్యార్థినులకు ప్రోత్సాహమిచ్చి, వారికి పీహెచ్‌డీ వంటి ఉన్నతమైన విద్యార్హతలకు మార్గ సూచనలు కావించి, ఉద్యోగావకాశములను తెలిపి, వారి సామర్థ్యమును ఇనుమడింపజేశారు. విద్యను ఆర్జించే వారెవ్వరిని ***(తరువాయి 16వ పేజీలో)***

(15వ పేజీ తరువాయి) చూసినా ఎంతో ప్రేమతో ఆదరించారు. పదవీ నిర్వహణ కాలంలోనూ, అనంతరము కూడా అనేకమందికి విద్యాదానం చేసిన ఉత్తమ గురువుగా భాసించారు.

ఆంధ్ర వాఙ్మయాభివృద్ధి, ఆంధ్ర సంస్కృతి వికాసము వేద పురాణేతిహాసాల పునరుజ్జీవనం వారి అభిలాష. ఈ మూడు అంశాలను గూర్చి వారు ఆంధ్ర ప్రదేశంలో ఉపన్యసించని గ్రామం లేదు. తెలంగాణా ప్రాంతంలో బాటలు లేని కొన్ని ఊర్లకు వారు బండిలో వెళ్లి ఉపన్యసించేవారు. దివాకర్ల వారికి తెలుగులో పంచకావ్యాల మనుచరిత్ర, వసుచరిత్ర, ఆముక్తమాల్యద, పారిజాతాపహరణము, శృంగార నైషధం, చేమకూర వేంకటకవి రచించిన విజయవిలాసాలంటే మక్కువ ఎక్కువ. వారి వక్తృత్వానికి ధారణ బంగారానికి పెట్టిన మెరుగులా ప్రకాశించింది. మహావక్తగా వారిని ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ గౌరవించింది.

దివాకర్ల వేంకటావధాని తాము నమ్మిన ఆశయానికి జీవితాంతం అంకిత మయ్యారు. క్రమశిక్షణ వారికి తోడుగా నిలిచింది. కష్టించి పనిచేయడం వారు నమ్మిన సూత్రం. వారు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్య పదవిని వహించినపుడు వృత్తి వ్యాపకాలలో తదితర సాహిత్య నిర్మాణ కార్యక్రమాలలో ఎంతగా మునిగి ఉండేవారో, పదవీ విశ్రమకాలంలో కూడా అవిశ్రామమైన సాహిత్య వ్యాసాంగాన్ని చేపట్టారు. వారు అసంఖ్యాకమైన గ్రంథాలకు పీఠిక లను రాసారు. ఎపుడు గ్రంథకర్తలోని గుణలేశాన్ని పర్వతమంతగా ఎత్తి చూపి ప్రశంసించి, వారు భవిష్యత్తులో మంచి కావ్యాలను రాయడానికి మార్గం చూపే వారు. దోషాలను రచయితకు నోటిమాటగా చెప్పేవారు. శ్రీశంకర భగవత్పాదుల సౌందర్య లహరిని వ్యాఖ్యానించినా, శ్రీశ్రీ మహాప్రస్థానాన్ని గురించి విశ్లేషించినా బోయి భీమన్న 'జన్మాంతర వైరమ్'ను గురించి ఉపన్యసించినా, ఇసుకపల్లి దక్షిణామూర్తి కథా సంపుటి ఆవిష్కరణ సభలో ప్రతి కథనూ సంగ్రహంగా తెలిపి పాత్ర చిత్రణను గురించి ప్రసంగించినా, జనరంజకంగా మాట్లాడారు. అక్షర రూపమైన సాహిత్యాన్నంతా తమ వక్షానికి హత్తుకున్నారు. మరుగున పడుతున్న తెలుగు పద్యాన్ని ప్రజా హృదయాల్లో వెలుగులోనికి తీసుకుని రావాలని దివాకర్ల వారు చేసిన ప్రయోగాల్లో ఒకటి ఉపన్యాసం. మరొకటి సాహిత్య రూపకం. వారు నిర్మాతగా, దర్శకులుగా ఇతర పండితకవి మిత్రులతో ప్రదర్శించిన 'భువనవిజయం' సాహిత్య రూపకం సామాన్య జనతలో సరికొత్త సాహిత్య జిజ్ఞాసను కలిగించింది.

దివాకర్లవారు ఆధ్యాత్మిక గుణ సంపన్నులు. వారు నిత్య దేవతార్చన, నమక చమకాలతో రుద్రాభిషేకం, గాయత్రి ఉపాసన కావించనిదే భుజించేవారు కాదు. శ్రీవిద్యా సేవా సమితి కార్యకర్తలుగా వేదమూలమైన హిందూ ధర్మ ప్రచారానికి పూనుకున్నారు. అతి క్లిష్టమైన వేద వ్యాఖ్యానాన్ని మొదలుపెట్టి, యజుర్వేదంలోని నాలుగు అనువాకాలకు ప్రతిపదార్థ తాత్పర్యాలను రాసారు.

దివాకర్లవారు పండిత కుటుంబంలో జన్మించారు. అతి ప్రసిద్ధులైన తిరుపతి వేంకట కవులలో దివాకర్ల తిరుపతిశాస్త్రి వారి పినతండ్రి. పేరులో అవధానిత్వం ఉన్నా అవధానియైనా, అలవోకగా ఒకటి రెండింటిని తప్ప అవధానాలను కావించలేదు. అతి సామాన్యమైన వైదిక బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి, క్లిష్టమైన ఆర్థిక పరిస్థితులలో పాండిత్యాన్ని ఆచార్యపరంపరలో పాండిత్యాన్ని జనసమూహ మధ్యానికి తీసుకుని వెళ్ళి సమాజా సాహిత్యాభిమాన వికాసాన్ని కలిగించారు

విద్యను వినయంతో మెరుగుదిద్దారు. వినయాన్ని విద్యతో ఉద్దీపింపజేసారు. సర్వ విద్యార్థి జనసాహితీ మిత్రులైన నిజమైన సూర్యునిగా వెలిగారు. వారికి ఆంధ్ర విశ్వవిద్యాలయం 'కళా ప్రపూర్ణ' బిరుదునిచ్చి గౌరవించింది. వారు 1986 అక్టోబరు 21న తమ ప్రభవాలను వాఙ్మయ లోకానికి వదలి తుది శ్వాసలను అనంతకీర్తి సంహితలలో లీనం చేసారు.

- డా॥ రాజేశ్వరి దివాకర్ల

వెండితెర గయ్యాళి శేషమాంబ 'లక్ష్మమ్మ' చిత్రంలో శేషమాంబ గయ్యాళి పాత్రను మరువలేనివారున్నారు

సూర్యకాంతం కంటే ముందు గయ్యాళి పాత్రలతో వెండితెర ఏలిన ఘనాపాటి తాడంకి శేషమాంబ. పాలుతాగే పసిపాపల్ని సైతం హడలుగొట్టే గొంతూ, నిప్పులు చెరిగే కళ్ళూ, భారీ శరీరం శేషమాంబ సైసర్గికతకు ఆభరణాలు.

ఆమెది గుంటూరు జిల్లా రేపల్లె. కూతురు పుట్టిన తర్వాత భర్త మరణించడంతో ఉదరపోషణార్థం డా. గోవిందరాజుల సుబ్బారావు ప్రోత్సాహంతో నాటకాల్లో నటించేవారు. బి.ఎన్.రెడ్డి ఒక పత్రికలో శేషమాంబ ఫోటో చూసి తమ 'వందేమాతరం' (1939) చిత్రంలో గయ్యాళి అత్తకు ఈమె సరిపోతుందని కె.వి.రెడ్డి, ఏ.కె. శేఖర్‌లను సూచించారు. తెనాలి పంపారట. వీళ్లిద్దరూ అక్కడ నటుడిగా పేరు మోసి నందూరి శేషాచార్యుల్ని కలిసి ఆమె ఇంటికి వెళ్లారు. శేషాచార్యులు ఆమెతో 'శేషమ్మా... పక్క వీధిలో మా వియ్యంకుడు నీ గురించి దుర్భాషలాడుతున్నాడ'ని చెప్పారట. దాంతో తోక తొక్కిన త్రాచులా రెచ్చిపోయి పరుష వాక్యాలు ఉచ్చరిస్తూ కొంగు బిగించారట శేషమాంబ. ఆమెని శాంతపరచి, 'నిన్ను పరీక్షించడానికి ఆడిన అబద్ధం' అని సినిమా నట విషయం చెప్పారట శేషాచార్యులు. అలా ఆమె 'వందేమాతరం'తో సినీ రంగ ప్రవేశం చేశారు. ఆ తర్వాత సుమంగళి, దేవత, తల్లిప్రేమ, శ్రీలక్ష్మమ్మకథ, చిన్నకోడలు వంటి ఎన్నో చిత్రాల్లో నటించారు. ఆమెను చూస్తున్నంతసేపూ ప్రేక్షకులు తిట్టకుండా ఉండలేకపోయేవారట. అంతగా గయ్యాళి పాత్రల్లో ఆమె జీవించేవారు. సూర్యకాంతం, ఛాయాదేవిలు తమ ఆదర్శనటిగా శేషమాంబను చెప్పుకునేవారు.

శేషమాంబ చివరి చిత్రం 'పెద్దమనుషులు'. 1958లో ఆమె మరణించారు. ఈమె కూతురు స్వరాజ్యలక్ష్మి కూడా చంద్రహారం, దొంగరాముడు వంటి పలుచిత్రాల్లో నటించారు. వాచకంతో ప్రసిద్ధి చెందిన 40వ దశకం వెండితెర నటుల్లో వేమూరి గగ్గయ్య, శేషమాంబను ప్రత్యేకంగా చెప్పుకునేవారు.

(డా. కంపెల్ల రవిచంద్రన్ సౌజన్యంతో)

2017లో ఓ మధుర సంస్మరణ!
మరుపుకురాని గీతాలు!
ఆయన పాటను లోకం మెచ్చింది!
ఈ గంధర్వ గానసుధామూర్తిని చూచి
ఓర్వలేని స్వర్గం పిలుచుకుపోయింది

నేను పుట్టాను.
ఒక జననం!
టాటా వీడ్కోలు ఒక మరణం!
జననానికి మరణానికి మధ్యలో... నా హృదయంలో నిదురించే చెలీ, ఒక ప్రేమ... **ని**లువవే వాలుకనుల దానా, ఒక టీజింగ్...**జ**గమేయ మాయ బతుకే మాయ ఒక వైరాగ్యం, **ని**దురపోరా తమ్ముడా.. ఒక వేదసారం, **నే**నొక పూలమొక్క కడ నిల్చి... ఒక విలాపం. సప్త సర్వస్తుతులను స్తుతించిన ఘంటసాల గాత్రం ఓ జీవన సూత్రం. మానవజన్మకు దివ్యగానామృతం. ఆ స్వరవేంకటేశ్వరునికి నీరాజనం.

ఘంటసాల పాడిన పాటల్లో అందుబాటులో ఉన్నవి మూడువేల పాటలు. ఆయన పదివేల పాటల వరకూ పాడారని కొందరి వాదన. ఆయన ఎన్ని పాటలు పాడారు? అనే పరిశోధన ఇప్పటికీ జరుగుతోంది. ఘంటసాల పాడిన పాటల్లో 'ఇవి పాపులర్' అని కొన్నింటినే చెప్పడం... సముద్రంలో చెమ్చా పట్టుకుని నీటిని తోడే ప్రయత్నం చేయడం వంటిదే! ఎన్నని చెప్పగలం? అందుకే అందరికీ తెలిసన ఆయన పాపులర్ సాంగ్స్‌లో మచ్చుకు ఒక 22 పాటల గురించి ఇక్కడ ప్రస్తావిస్తున్నాం. ఆయన ఆయన పుట్టింది 1922లో. కావున 22 మెలోడీ పాటలను గురించి ముచ్చటిస్తున్నాం.

1. నేను పుట్టాను ఈ లోకం మెచ్చింది (ప్రేమనగర్)

'నేను పుట్టాను ఈలోకం మెచ్చింది..' ఈ పాట నేటికీ వినపడుతుంటుంది. 'ప్రేమనగర్'లోని ఈ పాట అప్పట్లో చాలా పాపులర్. నిజానికి ఇది తాగుడు సందర్భంలో వచ్చే పాట కానీ, ఆ సందర్భంతో సంబంధం లేకుండా ఈ పాట ఎవర్‌గ్రీన్ అయింది. ఈ పాటను యానిమేషన్ల కోసం ఇప్పుడు ఎక్కడ చూసినా వాడుతున్నారు. అక్కినేని నటించిన ఆఖరిచిత్రం 'మనం'లో అక్కినేని కుటుంబమంతా కనిపించే సందర్భంలో ఈ పాటలో కొంత రీ-మిక్స్ చేసి వాడారు.

2. ఎంతఘాటు ప్రేమయో (పాతాళభైరవి)

గాయకుడు బడే గులామ్ అలీఖాన్‌ను మద్రాసు తీసుకొచ్చి, పాడించడానికి మద్రాస్ మ్యూజిక్ అకాడమీ ప్రయత్నించినప్పుడు అప్పట్లో చాలా మంది వ్యతిరేకించారు. అయినప్పటికీ ఎంతో కష్టపడి ఆయన కచ్చేరిని మద్రాసులో ఏర్పాటు చేశారు. ఆ సమయంలో ఘంటసాల తన ఇంట్లోనే బడే గులామ్ అలీఖాన్‌కీ, ఆయన వాద్య బృందానికి రెండు రోజులపాటు ఆతిథ్యం ఏర్పాటు చేశారు. ఆయన సతీమణి సావిత్రమ్మ వీళ్లందరికీ స్వయంగా చపాతీలు తయారు చేసేవారు. ఘంటసాల ఉదయం రికార్డింగ్ స్టూడియోకు వెళ్లి సాయంత్రం రాగానే బడే గులామ్ అలీఖాన్ బృందంతో రాగ సాధన చేసేవారు. హిందూస్తానీ రాగాలను ఆకళింపు చేసుకున్నారు. ఆ ప్రభావంతోనే 'ఎంతఘాటు ప్రేమయో...' పాటను రాగశ్రీ రాగాన్ని ఉపయోగించి స్వరపరిచారని అప్పట్లో కొందరు అనేవారు. ఘంటసాల స్వరపరచి పాడిన ప్రేమ గీతాల్లో ఇదొకటి

3. నా హృదయమంలో నిదురించే చెలి... (ఆరాధన)

ప్రేమ పాటల్లో మరో చెప్పుకోదగ్గ పాట 'నా హృదయంలో నిదురించే చెలి'. అక్కినేని నాగేశ్వరరావు అభినయించిన ప్రేమపాటల్లో ఆయన సతీమణి అన్నపూర్ణకు బాగా నచ్చిన పాట. ఈ విషయాన్ని పలు సందర్భాల్లో ఆవిడ స్వయంగా చెప్పారు.

4. అత్తలేని కొడలుత్తమురాలు (మనదేశం)

అప్పటి నుంచి ఇప్పటి దాకా శాశ్వతంగా ఉన్న పాటల్లో ఘంటసాల పాడిన 'అత్తలేని కోడలుత్తమురాలు' విశేషం ఏమిటంటే... సినిమా ద్వారా ఎక్కువ పాపులర్ అయిన ఈ పాట 'ప్రైవేట్ సాంగ్'గా శ్రోతల మనసు దోచుకుంది. చివరికి 'అత్తలేని కోడలుత్తమురాలు' ఒక నానుడి.

5. నిలువవే వాలుకనుల దానా... (ఇల్లరికం)

ఏ పాట అయినా ఘంటసాల నోట ప్రాణం పోసుకోవాల్సిందే! హీరోయిన్లను హీరో ఆటపట్టించే టీజింగ్ సాంగ్ 'నిలువవే వాలుకనులదానా..' అలాంటిదే. 'ఇల్లరికం'లోని ఈ పాటలో నటించడానికి అక్కినేని ఇష్టపడలేదు. అదే మాట చిత్రదర్శకుడు తాతినేని ప్రకాశరావుతో అన్నారు. కానీ, దర్శక నిర్మాతలను కాదనలేక నటించారు. చేసిన తర్వాత కూడా ఆయనకు మనసొప్పలేదు. 'ఈపాటకు ఎంత ఖర్చయితే అంత ఇస్తా... సినిమాలో నుంచి తీసేయండి' అని విన్నవించుకున్నారు. అప్పటికే సినిమా చూసిన పలువురు డిస్ట్రిబ్యూటర్లు ఈ పాట గురించి ప్రత్యేకంగా ప్రస్తావించడంతో ఉంచేశారు. మామూలుగా ఎయన్నార్ నటించిన ప్రతి సినిమా ఆయన భార్య అన్నపూర్ణ చూస్తారు. ఈ సినిమాను మూడు నాలుగుసార్లు చూడటంతో ఆయన కారణం అడిగితే... 'ఈ పాట చాలా నచ్చింది... అందుకే' అన్నారట.

6. సుందరి నీవంటి... (మాయాబజార్)

సినీ చరిత్రలో 'మాయాబజార్' ఓ ప్రత్యేకమైన పేజీ. ఆ చిత్రానికి ఘంటసాల ఓ స్వరకర్తగా వ్యవహరించారు. ఇందులో 'సుందరి నీవంటి దివ్యస్వరూపము...' పాట గురించి తెలియనవాళ్లు ఉండరు. ముందుగా ఈ పాటను గాయకుడు పిఠాపురం నాగేశ్వరరావు- సావిత్రి పాడగా రికార్డ్ చేయాలనుకున్నారు. ఇద్దరూ రిహార్సల్ కూడా చేశారు. ఈ పాటకు ఘంటసాల స్వరకర్త. చివరి నిమిషంలో దర్శక- నిర్మాతలు కేవీరెడ్డి, బి. నాగిరెడ్డి ఈ పాటను ఘంటసాల పాడితే బాగుంటుందనుకున్నారు. అప్పటివరకూ హాస్యరస గీతాలంటే పిఠాపురం నాగేశ్వరరావు- మాధవపెద్ది సత్యమే. అలాంటిది ఘంటసాలతో ఈ పాట పాడించడం ఓ ప్రయోగం. ఈ పాటను ఘంటసాల ఎంత అద్భుతంగా పాడారంటే హాస్యరస గీతాలకు తనదైన ముద్ర సంపాదించుకున్నారు.

7. పడవా వచ్చిందే పిల్లా.. (సిపాయి చిన్నయ్య)

పాట సాహిత్యం ఘంటసాట పట్టించుకునేవారు. 'సిపాయి చిన్నయ్య'కి స్వరకర్త ఎమ్మెస్ విశ్వనాథన్. అందులో 'పడవా వచ్చిందే పిల్లా' పాటను రికార్డ్ చేస్తామనగా ముందురోజు ఘంటసాలతో రిహార్సల్స్ చేయించారాయన. విశ్వనాథన్ పాన్ నములుతూ పదాలు పలికారు. దాంతో 'పడవా' బదులు 'భడవా' అని ఘంటసాలకు వినిపించింది. అది ఇబ్బంది అనిపించింది.